సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 5 । నవంబర్ । 2023



హోరాహోరీగా హాకీ పోటీలు

నక్కపల్లిలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 470 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 8లో



శ్రీవారికి తోమాల సేవ

విశాఖ: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం వేకువన తోమాల సేవ నిర్వహించారు.



ఏయూ విద్యార్థినుల ఎంపిక

విశాఖ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్–15 మహిళా క్రికెట్ జట్టుకు ఏయూ నుంచి పరిమళ, గాయత్రి ఎంపికయ్యారు.

సునిశిత పరీక్ష.. ఉత్తమ చికిత్స

కాండ్రేగుల రాజేష్ (పేరు మార్పు చేశాం) అనే యువకుడు ఆరు నెలలుగా క్షయ వ్యాధి నివారణకు మందులు వాడుతున్నాడు. అయినా పూర్తి స్థాయిలో ఈ వ్యాధి నయం కాలేదు. ఆరు నెలలు వాడినా ఇంకా ఆయాసం, నీరసం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం జరగడంతో ఆ వ్యక్తి మళ్లీ వైద్యులను సంప్రదించాడు. ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ మెషీన్ ద్వారా 'కల్చర్ సెన్సిటివిటీ ఆఫ్ ఆర్గానిజం' పరీక్ష చేశారు. క్రమపద్ధతిలో మందులు వాడకపోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడంతో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో నయం అవ్వలేదని తేలింది. వెంటనే అంతకన్నా ఎక్కువ పవర్ ఉన్న యాంటీ బయోటిక్ టాబ్లెట్స్ వాడాలని వైద్యులు సూచించారు.



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరికరాలు

- ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఆధునిక ఇంటిగ్రేటెడ్ ల్యాబ్
- బ్లడ్ కల్చర్ సెన్సిటివిటీ తెలిపే అధునాతన పరికరం
- రోగి తీసుకునే మందు పనితీరుపై విశ్లేషణ
- ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా అనకాపల్లిలో ఏర్పాటు
- రూ.కోటితో ల్యాబ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం





సాక్షి, అనకాపల్లి: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'నాడు–నేడు' ద్వారా ఆస్పత్రుల ఆధునికీకరణ, నూతన భవనాలు, వైద్యులు, మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న పథకాలతో పేదోడి చెంతకే వైద్యసేవలందిస్తోంది. వీటికి తోడుగా కార్పొరేట్ ఆస్పత్రులకు మించి పేద వాడికి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా రూ. కోటితో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ సదుపాయాన్ని అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు. వెంటనే ఎన్టీఆర్ ఆస్పత్రిలో దీనిని వినియోగంలోకి తీసుకొచ్చారు.

అన్ని రోగాలనూ ఒకేసారి గుర్తించేలా...

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌తో అన్ని రోగాలను ఒకేసారి గుర్తించవచ్చు. రోగి ఎన్ని వ్యాధులతో బాధపడుతున్నాడు? ప్రస్తుతం ఏ మందులు వాడుతున్నాడు? ఆ మందుల వల్ల ఎంత మేర ఆ వ్యాధి నివారణ అయ్యే అవకాశం ఉంది. ఇంకేమైనా మందులు వాడాలా? ఎలాంటి వైద్యం అందించాలి..? అనే రిసెర్చ్ ఒకే టెస్ట్‌తో ఇంటిగ్రేటెడ్ మెషీన్‌తో సాధ్యమవుతోంది. సాధారణ మలేరియా, డెంగీ, టైఫాయిడ్, ఇతర విషజ్వరాలు.. శరీరంలో వివిధ శరీర అవయవాల రుగ్మతలతో బాధపడుతున్నప్పుడు 'కల్చర్ సెన్సిటివిటీ నిర్ధారించేలా పరీక్షలు చేస్తారు.

సాధారణంగా ఒక రోగి మల్టిపుల్ వ్యాధులతో బాధపడుతున్నప్పుడు వాటిని గుర్తించడానికి రకరకాల రక్త పరీక్షలు, స్కానింగ్ వంటి పరీక్షలు చేస్తారు. రక్త పరీక్షలతో ఏది సెన్సిటివ్, ఏది రెసిస్టెంట్ అనేది గుర్తించడమే ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ప్రత్యేకత.

బ్లడ్ కల్చర్ సెన్సిటివిటీని సులభంగా గుర్తించవచ్చు. రోగి తీసుకునే డ్రగ్ వ్యాధి నియంత్రణపై రిసెర్చ్ చేస్తారు. బ్లడ్ ఇన్వెస్టిగేషన్ పరీక్ష ద్వారా ఆ ఇన్‌ఫెక్షన్‌కు ఏ మందు సెన్సిటివ్, ఏ మందు రెసిస్టెంట్ అనేది గుర్తించడానికి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఉపయోగపడుతుంది.

ఉత్తరాంధ్రలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలోనే..



అనకాపల్లిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం చాలా అభినందనీయం. రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను కేంద్ర, రాష్ట్ర వైద్యశాఖలు అందుబాటులోకి తీసుకొచ్చాయి. రెండో విడతలో ఉత్తరాంధ్ర నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసేందుకు ఎంపీ సత్యవతి, గతంలో అనకాపల్లి జిల్లాకు డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన డాక్టర్ శ్రావణ్‌కుమార్ కృషి కూడా ఉంది. ఐపీ పేషెంట్‌లకు అత్యవసర పరిస్థితుల్లో కల్చర్ సెన్సిటివిటీ, టిష్యూ కల్చర్, ఆటోమేటెడ్ కల్చర్ సెన్సిటివిటీ, టిష్యూ ఫ్లోటింగ్ బాత్, ఇంక్యుబేటర్ వంటి పరీక్షలు తక్కువ వ్యవధిలో పూర్తి చేసేలా ఉపయోగపడతాయి.

– శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్

విద్యతోనే ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రాంబిల్లి: విద్యతోనే ఆర్థిక స్వావలంబన సాధ్యపడుతుందని కేంద్ర హోం శాఖ అండర్ సెక్రటరీ రాజ్‌కుమార్ అన్నారు. రాంబిల్లి మండల పరిధిలో గల ఎంఎస్‌ఎంఈ కేంద్రం వద్ద నాలుగు రాష్ట్రాలకు చెందిన గిరిజన యువతీ యువకుల శిక్షణ కార్యక్రమం శనివారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాజకుమార్ మాట్లాడుతూ గిరిజన యువతీ యువకుల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 25 ప్రాంతాల్లో గిరిజన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలను నిర్వహిస్తోందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని గిరిజన యువత అభివృద్ధి చెందాలన్నారు. హోంశాఖ లెఫ్ట్ వింగ్ తీవ్రవాద విభాగం సెక్షన్ ఆఫీసర్ అనూజ్‌రానా మాట్లాడుతూ, విద్యతో పాటు నైపుణ్యం సాధించాలన్నారు. మంచి నైపుణ్యం వుంటే ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా వివిధ పథకాలు, ఆర్థిక అంశాలను అనకాపల్లి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యన్నారాయణ వివరించారు. కార్యక్రమంలో అనకాపల్లి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శరత్ యువతీ యువకులకు అందించే రుణాలపై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.



గిరిజన సంప్రదాయ నృత్యం ప్రదర్శన

న్యూస్‌రీల్

చోడవరం పోలీస్‌స్టేషన్లో డీఐజీ తనిఖీలు



పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న డీఐజీ

చోడవరం రూరల్: విశాఖపట్నం రేంజి డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్(డీఐజీ) ఎస్.హరికృష్ణ శనివారం చోడవరం పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. పోలీసు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. వివిధ కేసులలో దర్యాప్తు తీరు, పెండింగ్ కేసుల గురించి సీఐ బి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన వారితో మెలిగే తీరులో స్నేహభావం, ఆపదలో ఆదుకునే ధోరణిని కనబరచాలన్నారు. ముందుగా డీఐజీ హరికృష్ణకు చోడవరం పోలీసులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ వి.సుబ్బరాజు ఉన్నారు. చోడవరం ఎస్‌ఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగాల మెరిట్ లిస్టు

మహారాణిపేట : స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో పెట్టారు. గతంలో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు పెట్టారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించారు. దాదాపు 200 పైగా అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించి ఫైనల్ మెరిట్ లిస్టు పెట్టినట్టు వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. http://cfw.ap.nic.inలో ఫైనల్ మెరిట్ లిస్టు ఉంచినట్టు పేర్కొన్నారు. త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇతర ప్రక్రియ జరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూడోలో రోలుగుంట విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం వరప్రసాదరావు, ఉపాధ్యాయులు

రోలుగుంట: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం సిగిచెర్లలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో టోర్నమెంటులో రోలుగుంట విద్యార్థిని యర్రంశెట్టి స్పందన కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు విద్యార్థిని స్పందనను, ఈ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను పీడీ గోవిందను హెచ్‌ఎం వరప్రసాదరావు, ఉపాధ్యాయ సిబ్బంది శనివారం అభినందించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఆదిత్యవర్ధన్



యోగాసనం చేస్తున్న ఆదిత్యవర్ధన్

అనకాపల్లి టౌన్: కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన శీరం ఆదిత్య వర్ధన్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో నాలుగో స్థానం సాధించాడు. ఈ నెలాఖరులో త్రిపుర రాష్ట్రం అగర్తలలో నిర్వహించే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు యోగా గురువు హెచ్.భాస్కర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటరు నమోదు, తొలగింపులో అప్రమత్తత

- అధికారులకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచన



నరసింగబిల్లి హైస్కూల్లో రక్తహీనత ఉన్న విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కశింకోట: కొత్త ఓటర్ల నమోదు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్ 19, 20 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల శిబిరాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా 18, 19 సంవత్సరాల వయసున్న ఓటర్లను నమోదు చేసేటపుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. మరణించిన ఓటర్లను నిర్ధారణ చేసుకున్నాకే తొలగించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ వారి చిరునామా వివరాలు ఆధారంగా ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేసినా వాటిని స్వీకరించాలన్నారు. రెండో రోజు ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

రక్త హీనత విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ :

రక్త హీనత ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. నరసింగబిల్లి హైస్కూల్లో రక్త హీనత విద్యార్థుల పట్ల సిబ్బంది తీరును ఆరా తీశారు.

విద్యార్థులతో మాట్లాడారు. రక్త హీనత ఉన్న విద్యార్థులు మాత్రలతోపాటు, సరైన పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా రక్త హీతన విద్యార్థుల జాబితాలను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.

అబ్బుర పరచిన చిత్రకళా ప్రదర్శన, పోటీ

- వేడుకగా 6వ జాతీయ చిత్రకళా పోటీలు, ప్రదర్శన
- చోడవరంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు కృషి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ప్రదర్శనను ప్రారంభించి, చిత్రాలను తిలకిస్తున్న విప్ ధర్మశ్రీ, మాజీ వీసీ ముత్యాలనాయుడు



ప్రదర్శనలో ఉంచిన విద్యార్థుల చిత్రాలు

చోడవరం: ప్రతి చిత్రం ఆలోచన రేకెత్తించింది. ఏదో తెలియని ఓ అలౌకికానందాన్ని కలిగించింది. ఆ చిత్రాలను చూసినవారంతా చిత్తరువులయ్యారంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, గుజరాత్, బీహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి ప్రముఖ చిత్రకారులు వేసిన అపురూప చిత్రాలకు స్థానిక ప్రేమ సమాజం ఆవరణ వేదికయింది. చరిత్ర, సంస్కృతీ, సంప్రదాయాలు, సామాజిక స్పృహ, మానవీయతలను ప్రతిబింబిస్తూ వేసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 6వ జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు, ప్రదర్శనను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం ప్రారంభించారు. 198 పెద్ద చిత్రాలు పోటీ పడ్డాయి. విద్యార్థులు వేసిన 2,400 చిత్రాలను నన్నయ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ చిత్రకారులను ప్రోత్సహించడంతోపాటు, చోడవరంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా అన్ని రంగాల వారిని కలిగి ఉన్న అద్భుతమైన జిల్లాగా అభివర్ణించారు. ఎందరో కళాకారులు, ఎన్నో కళలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వ్యవసాయం, విభిన్న వర్గాల ప్రజలున్న చోడవరంలో చిత్రకారులు భావితరాలకు దిక్సూచిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత చరిత్రకు చిత్రాలే ప్రధాన ఆధారాలన్నారు. ఒక చిత్ర ఎన్నో భావాలకు సమాధానం చెబుతుందన్నారు.

ఈ సందర్భంగా చోడవరం చిత్రకళా నిలయం ఫౌండర్, పోటీల నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు చిత్రకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వీవీ సన్యాసినాయుడు, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రవివర్మ, ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ప్రేమసమాజం రాజు, ఆర్క్ ప్రసాద్, దేముడు మాస్టారు, టీవీ రమణ మాస్టారు, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. చిత్ర ప్రదర్శనను తిలకించేందుకు పట్టణంలోని పలు కాలేజీల విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇది ల్యాబా.. స్టోర్ రూమా?

- కొత్తపేట హైస్కూల్లో ల్యాబ్ నిర్వహణపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం మండిపాటు
- స్టెమ్ ల్యాబ్‌లో 2 ల్యాప్‌టాప్‌లు మాయం కావడంపై ఆరా

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పాఠశాలల్లో సైన్సు ల్యాబ్‌ల నిర్వహణను పరిశీలించేందుకు శనివారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో పర్యటించాయి. ఇద్దరు సభ్యులతో ఉన్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రభుత్వ పాఠశాలల్లో వున్న అటల్ టింకరింగ్ ల్యాబ్, స్టెమ్ ల్యాబ్, జనరల్ ల్యాబ్‌లు తనిఖీ చేశాయి. యలమంచిలి, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, ఎస్.రాయవరం, కశింకోట మండలాల్లో తనిఖీలు చేపట్టారు. యలమంచిలిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం షాహినా పర్వీన్ (కర్నూలు), జి.లక్ష్మణరావు (శ్రీకాకుళం)లు ల్యాబ్‌ను తనిఖీ చేశారు. దుమ్ము, ధూళి పట్టి ఉన్న విలువైన పరికరాలను చూసిన టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఇది ల్యాబా.. స్టోర్ రూమా? అంటూ మండిపడ్డారు. ఈ పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా స్టెమ్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.12 లక్షలు కేటాయించగా, స్టోర్ రూం కంటే అధ్వానంగా ఉందని కమిటీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపేట హైస్కూల్ స్టెమ్ ల్యాబ్‌లో 4 ల్యాప్‌టాప్‌లకు రెండే ఉన్నాయని గుర్తించారు. రెండు చోరీకి గురయ్యాయని, వీటికి సంబంధించి సరైన రికార్డులు లేవని తెలియడంతో కమిటీ ప్రతినిధులు ఆశ్చర్యపోయారు. శనివారం పాఠశాల హెచ్‌ఎం వైవీ రమణ సెలవు పెట్టడంపై బృందం సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొత్తపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు క్లాస్ తీసుకున్నారు. సైన్సు బోధన, అభ్యసన కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ల్యాబ్స్ (స్టెమ్), ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలు నెహ్రూ బాలల సైన్సు ఫేర్స్, స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్, రాష్ట్రీయ సైన్సు ఫేర్స్ కౌశల్ క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ఇవన్నీ విజయవంతం కావాలంటే ఉపాధ్యాయుల్లో మార్పు రావాలని సూచించారు.

విద్యాబోధనలో డిజిటల్ టెక్నాలజీ

చోడవరం రూరల్: విద్యాబోధనలో డిజిటల్ టెక్నాలజీని ఉపాధ్యాయులందరూ వినియోగించాలని టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యుడు బి.వి.రమణ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను టాస్క్‌ఫోర్స్ టీం పరిశీలించింది. సైన్స్ ల్యాబ్‌కు ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలను ఉపాధ్యాయులు తమ బోధనలో వినియోగిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఉపాధ్యాయులు తయారు చేసిన పలు రకాల బోధనా వీడియోలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు పాఠశాలలోని సైన్సు లేబొరేటరీని సందర్శించారు. సైన్సు బోధనలో వాటిని ఏ రీతిలో వినియోగిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో పరికరాల అమరికను, విద్యార్థులకు సద్వినియోగం చేస్తున్న తీరును పరిశీలించారు. టీమ్ సభ్యుడు రమణ వెంట డీఎస్‌వో కాళిదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, సీఆర్‌సీ కె.వి.ఎం.నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపేట హైస్కూల్లో స్టెమ్ ల్యాబ్ పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు తనిఖీ



పరిశీలిస్తున్న ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కోటవురట్ల: లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హెచ్చరించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వేములపూడి, యండపల్లిలోని మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వారి లైసెన్సులు, స్టాక్ బుక్, క్రాకర్స్, సేఫ్టీ అంశాలు పరిశీలించారు. ప్రమాద సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. తయారీ కేంద్రంలో చిన్న పిల్లలు లేకుండా చూడాలన్నారు. తయారీ కేంద్రంలో పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు



బాలుర మధ్య జరుగుతున్న పోటీలు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో13 జిల్లాల నుంచి 470 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, అనంతరపురం, చిత్తూరు, కర్నూలు, గుంటూరు తదితర జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. నక్కపల్లిలో బోదిగల్లం రోడ్డులో ఉన్న హెటిరో హాకీ క్రీడా మైదానంలో బాలురకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బాలికలకు పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు శనివారం బాలికల విభాగంలో క్వార్టర్ వన్‌లో చిత్తూరు, శ్రీకాకుళం జట్ల మధ్య పోటీ జరగ్గా చిత్తూరు విజయం సాధించింది. క్వార్టర్ 2లో నెల్లూరు పశ్చిమ గోదావరి జట్ల మధ్య పోటీలు జరగ్గా పశ్చిమ గోదావరి విజయం సాధించింది.

బాలుర విభాగంలో..

విశాఖపట్నం తూర్పుగోదావరి మధ్య జరిగిన పోటీల్లో విశాఖపట్నం విజయం సాధించింది. అలాగే అనంతపురం చిత్తూరు మధ్య జరిగిన పోటీల్లో అనంతపురం, చిత్తూరు ప్రకాశం మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం, నెల్లూరు విజయనగరం మధ్య జరిగిన పోటీల్లో నెల్లూరు విజయం సాధించాయి. కడప అనంతపురం మధ్య జరిగిన పోటీ టై అయింది. కర్నూలు శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం విజయం సాధించింది. క్రీడాకారులను ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, శేఖర్,ఎంఈవో నరేష్ నోడల్‌టీము హెచ్‌ఎంలు నూకరాజు, శ్రీనివాసరావులు పరిచయం చేసుకున్నారు.

హైస్కూల్ 'సెల్'గాటంపై విచారణకు డీఈవో ఆదేశం

- సాక్షి కథనానికి స్పందన

యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాక హైస్కూల్లో హెచ్‌ఎం కాండ్రేగుల సూర్యనారాయణ మొబైల్ ఫోన్‌ను ఇదే పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ వెంకటేష్ శుక్రవారం దాచిన సంఘటన కలకలం రేపింది. ఈ మేరకు సాక్షిలో శనివారం ప్రచురితమైన హెచ్‌ఎంతో ఉపాధ్యాయుడి 'సెల్'గాటం కథనంపై డీఈవో వెంకటలక్ష్మమ్మ స్పందించారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని యలమంచిలి ఎంఈవో-1 మీనాక్షిని డీఈవో ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో హెచ్‌ఎం చేతులు శుభ్రపర్చుకోవడానికి వెళ్లిన సమయంలో ఆయన మొబైల్‌ను నీళ్ల ట్యాంకు వద్ద వున్న ఇసుకలో స్కూల్ అసిస్టెంట్ వి.వెంకటేశ్ దాచేసినట్టు గుర్తించారు. అనంతరం నాటకీయ పరిణామాల నడుమ మొబైల్ ఫోన్‌ను దాచింది తానేనని ఉపాధ్యాయుడు వెంకటేశ్ అంగీకరించారు. దీనికి సంబంధించి సాక్షి పత్రికలో వచ్చిన కథనం మేరకు జెడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శానాపతి రాము, ఎంపీపీ స్కూల్, జెడ్పీ హైస్కూల్ చైర్మన్లు మొల్లేటి ప్రసాద్, దేవరాపల్లి రమణ హైస్కూల్‌కు వెళ్లారు. హెచ్‌ఎం సమక్షంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడే మొబైల్ ఫోన్‌ను దాచడం, పాఠశాలలో వివాదాలు సృష్టించడం మంచిదికాదని హితవు పలికారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ విషయాన్ని తాము ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

నేత్రపర్వంగా కోటి బిల్వార్చన

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కేరళ పందళ రాజవంశీకుల ఆధ్వర్యంలో పూజలు
- కార్యక్రమానికి హాజరైన అయ్యప్ప సన్నిధానం పూజారులు



తుని సమీపంలో నేత్రపర్వంగా జరుగుతున్న కోటి బిల్వార్చన

నక్కపల్లి/పాయకరావుపేట : కాకినాడ జిల్లా తుని సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం కోటి బిల్వార్చన కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఉత్తరాంధ్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాది మంది సాధారణ భక్తులతో పాటు, అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. కోటి బిల్వార్చన, పడిపూజకుకు కేరళ శబరిమల సన్నిధానం నుంచి పందళ రాజవంశీకులు, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధానార్చకులు మేల్‌శాంతి, తిరు ఆభరణాలు తీసుకెళ్లే స్వామి, చండా వాయిద్య కళాకారుల బృందం హాజరైంది. వారి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి కోటి బిల్వార్చన పడి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను తిలకించేందుకు వేలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ప్రారంభమైన ఈ పూజ భక్తులకు కనువిందు చేసింది. ఈ సందర్భంగా శనివారం వేకువజామునే అష్టద్రవ్య లక్ష్మీగణపతి హోమం, దండపాణి గురుస్వామి జయంతోత్సవం సందర్భంగా కత్రాళ్ల కొండ వద్ద ఉన్న అయ్యప్పస్వామి గుడి నుంచి సభా స్థలం వరకు వందలాది మంది అయ్యప్ప భక్తులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి పడి పూజ, కోటి బిల్వార్చన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తుని, పాయకరావుపేట జంట నగరాలకు చెందిన అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండుపాణి గురుస్వామి పర్యవేక్షణలో ప్రత్యేకంగా నిర్మించిన తాత్కాలిక ఆలయంలో కోటి బిల్వార్చన పడిపూజలు జరిగాయి. పదునెంబాడి మెట్లను ఏర్పాటు చేశారు. పడితొక్కుతూ అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

గంజాయి రవాణాలో సరికొత్త ఎత్తుగడ

- వ్యాన్ కేబిన్‌లో దాచిన 305 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు పట్టుకున్న గంజాయి

నక్కపల్లి: గంజాయి స్మగ్లర్లు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. జాతీయ రహదారిపై వేంపాడు టోల్‌గేట్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలివి. వాహనాల తనిఖీల్లో భాగంగా మహారాష్ట్రకు చెందిన వ్యాన్‌లో ప్రత్యేకంగా అమర్చిన కేబిన్‌లో 305 కిలోల గంజాయి ఉంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పన్న తెలిపారు. గంజాయి విలువ రూ.4 లక్షలు ఉంటుందని అంచనా.

వివాహితపై అత్యాచారం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఓ వివాహితపై అత్యాచారానికి పాల్పడ్డాడు ఓ ప్రబుద్ధుడు. జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసైన కామాంధుడిపై బాధితురాలి కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు చెప్పిన వివరాల ప్రకారం యలమంచిలి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన బాధిత మహిళ (45), 25 ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి సోదరుడి కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఈ నెల ఒకటో తేదీన అన్న, వదిన పనులకు వెళ్లగా వారి ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అదే గ్రామానికి చెందిన కాండ్రకోట కన్నయ్యనాయుడు(50) అలియాస్ నానాజీ ఇంట్లోకి ప్రవేశించి, భోజనం చేయడానికి సిద్ధమవుతున్న బాధితురాలిని అరవకుండా నోరు మూసి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి వెళ్లిపోయాడు. ఘటన తర్వాత బాధితురాలు విచారంగా ఉండడాన్ని చూసిన ఆమె వదిన ఏం జరిగిందని ఆరా తీయగా కామాంధుడి దుశ్చర్యను వివరించింది. దీంతో జరిగిన ఘోరంపై బాధితురాలితో కలిసి ఆమె వదిన శనివారం యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు నిందితుడిపై ఐపీసీ సెక్షన్లు 376, 448, 323, 506 కింద కేసు నమోదు చేశారు.

బైక్ బోల్తా.. యువకుడి దుర్మరణం



యువకుడు సంతోష్ కుమార్ మృతదేహం

యలమంచిలి : పట్టణానికి సమీపంలో కొక్కిరాపల్లి హైవే కూడలి వద్ద శనివారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తా పడి యువకుడు దుర్మరణం పాలయ్యాడు. యలమంచిలి పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాల ప్రకారం కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన గురజాడ సంతోష్ కుమార్ అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వస్తుండగా కొక్కిరాపల్లి కూడలి వద్ద మారుతీ సుజుకీ షోరూం ఎదురుగా రోడ్డు పక్కన పడి ఉన్న లారీ టైరు ముక్కపై నుంచి ప్రయాణించడంతో అతను నడుపుతున్న ద్విచక్రవాహనం బోల్తా పడింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతం నేడు

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సామూహిక అనఘాష్టమి వ్రతాలు నిర్వహించనున్నట్లు క్షేత్ర నిర్వాహకుడు ఆంజనేయమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంధుమిత్ర సమేతంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. క్షేత్రంలో నిర్వహించే వ్రతాలకు హాజరయ్యే భక్తులు కొబ్బరికాయలు, అరటిపళ్లు, పువ్వులు వెంట తీసుకురావాలని కోరారు.

సీఎస్సీ అకాడమీతో డీవీఎన్ కళాశాల ఎంవోయూ



సంతకాలు చేసుకున్న పత్రాలతో రత్నాకర్, సంస్థ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్: భారత ప్రభుత్వ సంస్థ సీఎస్సీ అకాడమీ(మినిస్ట్రీ ఆఫ్ ఎల్రక్టానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)తో స్థానిక దాడి వీరునాయుడు కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వెల్లడించారు. కళాశాలలో శనివారం సీఎస్సీ అకాడమీ ప్రతినిధులతో ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికత అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కుల గణన నిర్ణయంపై హర్షం

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం కుల గణన, కులాల వారీ లెక్కలు తేల్చడానికి ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు తెలిపారు. గవరపాలెంలోని తమ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కులాల లెక్కలను ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే తయారు చేయించి, రాబోయే ఎన్నికల్లో బీసీ కులాల వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి లెక్కలు పూర్తిచేసి క్యాబినెట్లో తీర్మానం చేయాలని కోరారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆరు మాసాల క్రితం బీసీ గణాంకాలను తయారు చేయించి బీసీ వర్గాలకు న్యాయం చేకూర్చినట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 2,329 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,160	4,460
మొదటి రకం	3,840	4390
రెండో రకం	3,540	3,900
మూడోరకం	2,810	3,660

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు : రాజా
లియో :సత్యనారాయణస్క్రీన్-1
మ్యాడ్ :సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి : షిర్డిసాయి
కీడా కోలా : పర్తిసాయి
--- : వెంకటేశ్వర
ఘోస్ట్ : శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2 : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 436 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 427 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలందరికీ రక్ష



ఆయాసంతో బాధపడుతున్న రోగిని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి



అవ్వకు కేస్ షీట్‌తోపాటు మందులు అందిస్తున్న ఎంపీ సత్యవతి

- మరో రెండు రోజుల్లో తొలి దశ వైద్య శిబిరాలు పూర్తి
- జనవరి నుంచి ప్రతి మండలంలో నెలకు 4 శిబిరాలు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీ బీవీ సత్యవతి



ఆరోగ్య సురక్ష శిబిరంలో పౌష్టికాహార ప్రదర్శన



ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

అనకాపల్లిటౌన్: రాష్ట్రంలో ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీ పరిధి సచివాలయం-23 ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముందుగా ప్రతి ఇంటికి ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వెళ్లి రక్తపరీక్షలు చేయడం, టోకెన్లు ఇచ్చి సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించడంతో ప్రజల్లో వైద్యంపై ఆసక్తి పెరిగిందన్నారు. ప్రజలందరి దీవెనలతో మంచి పాలన సాగుతోందని, ప్రభుత్వం విద్య, వైద్యాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలనే దృఢ సంకల్పంతో పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చిన్న చిన్న వ్యాధులకు సర్కారు ఆస్పత్రుల చుట్టూ తిరగడంతో రోగులు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుత పాలనలో ప్రజల ముంగిటే వైద్యం అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తోందన్నారు. పలు వ్యాధులతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల్లో ధైర్యం పెరిగిందన్నారు. ఆధార్ ద్వారా ప్రతి వ్యక్తిని పరీక్షించి సదరు వ్యక్తి ఏయే వ్యాధులతో బాధ పడుతున్నారో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అవ్వా తాతలు వైద్యశిబిరాలకు హాజరై వైద్యుల వద్ద తమ సమస్యలను వివరించి, మెరుగైన వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు.

మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి మరిన్ని సంక్షేమ పథకాలతోపాటు, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. తొలిదశ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు మరో రెండురోజుల్లో పూర్తవుతున్నాయని, వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రతి మండలంలో నెలకు నాలుగుసార్లు వైద్యశిబిరాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సురక్ష వైద్య శిబిరాల ద్వారా సుగర్, బీపీ, క్యాన్సర్, గుండెవ్యాధులతోపాటు వివిధ రోగాలతో బాధపడేవారి సమస్యలు తెలుసుకుని సకాలంలో వైద్యం అందించవచ్చన్నారు. రాష్ట్రంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని సీఎం జగన్ సహకారంతో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు మూడు సెంట్లు ప్రభుత్వ స్థలం ఇచ్చేందుకు అసెంబ్లీ కేబినెట్ సమావేశంలో తీర్మానించడం అభినందనీయమన్నారు.

శిబిరానికి 285 మంది హాజరు కాగా 15 మందిని విశాఖ కేజీహెచ్‌తోపాటు, ఎన్టీఆర్ వైద్యాలయానికి రిఫర్ చేశారు. అంతకుముందు యూపీహెచ్‌సీలో అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆమె ఆరా తీశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ దంపతులు, జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజని, స్పెషలిస్టు వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా చేర్చాలి



పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



గవరపాలెం పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

- ప్రత్యేక నమోదు శిబిరాలను పరిశీలించిన ఆర్వో చిన్నికృష్ణ
- శనివారం ఒక్కరోజే 320 మంది యువ ఓటర్ల దరఖాస్తు

అనకాపల్లి రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్చాలని బీఎల్వోలు, ఇతర ఎన్నికల సిబ్బందిని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో), అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ-2023లో భాగంగా శనివారం అనకాపల్లి పట్టణం, మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయన పరిశీలించారు. అనకాపల్లి పట్టణంలో గవరపాలెం, రాజా సినిమా హాల్ ఎదురుగా ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 208, 209 నంబర్ల పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగులకు ర్యాంపుల పరిస్థితిని చూసి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ఓటరు జాబితాను పరిశీలించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు దాటే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో మరణించినవారి పేర్లను తొలగించేందుకు సంబంధిత కుటుంబ సభ్యుడి నుంచి ఫారం-7 స్వీకరించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్వోల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. శనివారం ఒక్కరోజే 320 వరకు యువ ఓటర్లు కొత్తగా ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎన్నికల విభాగం సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవాలు



కుంచావారి గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



వేల్పులవీధి అమ్మవారి ఊరేగింపు రథాను ప్రారంభిస్తున్న జానకీరామరాజు, రమేష్

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి, కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవాన్ని శనివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి పీఠాన్ని వేల్పుల గణేష్ స్వగృహం నుంచి బయటకు తెచ్చారు. పూడిమడక రహదారిలో వరిపొలం నుంచి వరి దుబ్బు తీసుకుని వచ్చి కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశారు. వేల్పుల వీధి అమ్మవారి ఊరేగింపు రథాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌లు ప్రారంభించారు. అనంతరం అమ్మవార్లను పట్టణంలో పురవీధుల గుండా ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవార్లను ఆలయాల్లో నిలుపుదల చేయనున్నారు. కార్యక్రమంలో వేల్పుల వీధి, కుంచావారివీధి ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటరు ప్రత్యేక శిబిరానికి స్పందన



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్‌నాయుడు

కశింకోట: మండలంలో మొదటి రోజు శనివారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో 63 దరఖాస్తులు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు తెలిపారు. వీటిలో కొత్త ఓటర్ల కోసం 30 దరఖాస్తులు, ఓటరు పేర్ల మార్పులు, చేర్పుల కోసం 18 దరఖాస్తులు, మరణించిన, స్థానికంగా లేని ఓటర్ల తొలగింపునకు 15 దరఖాస్తుల వచ్చాయన్నారు. మండలంలోని 71 కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఆదివారం కూడా ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

స్థానికడీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మొత్తం 49 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్తగా ఓటరు నమోదుకు 26 మంది ఫారం-6ను సమర్పించారు. ఓటరు జాబితాలో పేర్ల మార్పులు, చేర్పుల కోసం 23 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం కూడా ఓటర్ల నమోదు, సవరణల కార్యక్రమం కొనసాగనుందన్నారు. అర్హులు తమ ఓటును నమోదు చేసుకోవాలని, మార్పులు, చేర్పులు అవసరమైన వారు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

98.75 శాతం పింఛన్ల పంపిణీ

కశింకోట: మండలంలో ఈ నెల 98.75 శాతం మందికి పింఛన్ల సొమ్ము పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోఆర్డీ ఎం.సోమరాజు శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 10,569 మంది వృద్ధాప్య, వికలాంగ, వితంతు, ఇతర పింఛన్‌దారులుండగా వారిలో 10,437 మందికి పింఛన్లు అందించినట్లు పేర్కొన్నారు. రూ.2.82 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాల వల్ల పంపిణీ కాలేదని, వారికి కూడా వీలైనంత వేగంగా అందిస్తామన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ



గర్భిణులకు రొట్టెలు, ఫ్రూట్స్ పంపిణీ చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ జన్మదిన వేడుకలను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. వైద్యాలయం సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆస్పత్రిలో గర్భిణులకు, రోగులకు రొట్టెలు, పాలు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోరిబిల్లి పరి, అనిల్‌కుమార్, రాజు, నాయుడు, రవి, లోకేష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కను నాటుతున్న ఎంఈవో చిట్టిబాబు, సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్: పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే పర్యావణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని ఎంఈవో కె.చిట్టిబాబు అన్నారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1985-86 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల(మిత్ర మా.. కుశలమా) సంఘం ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా పట్టణ పరిధి ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 500 మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. రోజురోజుకు వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతోందని, కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలను నాటి, వాటి పర్యవేక్షణ తీసుకోవాలన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మామిడి, జామ, ఉసిరి, మారేడు తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పి.ఎల్.నారాయణ, కోశాధికారి పలకా నాగేశ్వరరావు, సభ్యులు బోని శ్రీనివాసరావు, బచ్చు శ్రీనివాసరావు, మామిడి బాబురావు, యాండ్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



ఎమ్మార్పీఎస్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంగరాజు

అనకాపల్లిటౌన్: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్టమూరి మంగరాజు కోరారు. ఈ నెల 11న హలో మాదిగ.. ఛలో హైదరాబాద్(మాదిగ విశ్వరూప మహాసభ) గోడ పత్రికను విజయరామరాజుపేటలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్రమోదీ విచ్చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయడంతో మాదిగలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లి చిన్నఅప్పారావు, కొండలరావు, మారేడిపూడి ఈశ్వరరావు, ముప్పిడి చిన్న, ములగాడ నూకన్న, ప్రసాద్, బద్రి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కూలీ మృతి

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కూలీ విశాఖ కేజీహెచ్‌లో శనివారం మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి-అనకాపల్లి జాతీయ రహదారిలో తాళ్లపాలెం వంతెన వద్ద ఈ నెల 1న రాత్రి వేగంగా వస్తున్న మోటారు బైక్ అదుపు తప్పి రోడ్డు మధ్య డివైడర్‌ను ఢీకొని కింద పడింది. దీంతో బైక్ నడుపుతున్న మాకవరపాలెం, జి.కోడూరుకు చెందిన కూలీ తోట అప్పారావు(42) తలకు తీవ్ర గాయమైంది. తనతోపాటు యలమంచిలి మండలం వెంకటాపురంలో బంధువుల ఇంట వివాహానికి వెళ్లి వచ్చిన జి.కోడూరు గ్రామానికి చెందిన తోట సత్తిబాబు, మరొకరి సహాయంతో అప్పారావును 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ నెల 3న కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు వరసకు సోదరుడు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

'నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు'



పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్న ఆటో డ్రైవర్లకు నోటీసులు అందిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఆటో డ్రైవర్లు రహదారి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను కోరారు. స్థానిక నెహ్రూచౌక్ కశింకోట ఆటోస్టాండ్ డ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటో వెనుక భాగంలో విద్యార్థులు, ప్రయాణికులను కూర్చోబెట్టి, ప్రమాదాలకు కారణం కావద్దని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఓవర్ లోడ్‌తో ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు సీఐ శ్రీను నోటీసులిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ ఉత్సవం



పరవాడపాలెంలో గౌరమ్మను దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

కశింకోట: మండలంలోని పరవాడపాలెంలో గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరమ్మను గ్రామంలో ఊరేగించారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో దర్శించి, పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ గౌరమ్మను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆయనకు దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించింది. ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ గొంతిన లోవ అప్పారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగి దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన నాగేశ్వరరావు, కొయిలాడ నాగు, వేగి పవన్‌కుమార్, రేబాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు వరలక్ష్మి

కశింకోట: సీపీఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి కోరారు. మండలంలోని తేగాడలో శనివారం ప్రజా రక్షణ భేరిపై మహిళలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి జరగనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. వీటిని వ్యతిరేకిస్తూ జరిగే బహిరంగ సభకు కార్మిక, కర్షక, ఉద్యోగ, మహిళా వర్గాలు, ప్రజలు అధికంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లిలో ఆదివారం జరగనున్న ప్రజా రక్షణ భేరి ప్రచార బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరారు.

కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న బోయిన వెంకటరమణ

అనకాపల్లిటౌన్: మండలంలోని సుందరయ్య గ్రామానికి చెందిన అర్థశాస్త్రం(ఎకనామిక్స్) అధ్యాపకుడు బోయిన వెంకటరమణకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. గిరిజనుల మైనర్ అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటి మార్కెటింగ్ వ్యూహాలపై ఆయన చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డీన్, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈయన యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన సుందరయ్యపేట గ్రామానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నేత, దివంగత బోయిన మల్లయ్య పెద్ద కుమారుడు. కశింకోట మండలంలో ఎస్‌జీటీగా, పూడిమడక ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా, జూనియర్ లెక్చరర్‌గా రోలుగుంట, నక్కపల్లి, చోడవరం, యలమంచిలిలో పనిచేశారు. డాక్టరేట్ రావడం పట్ల యలమంచిలి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అభినందించారు.

ఘనంగా శకుంతలాదేవి జయంతి



వెదురుపర్తి హైస్కూల్లో నృత్యాల ద్వారా విద్యార్థులకు గణితంపై అవగాహన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్లో శనివారం మానవ గణన యంత్రంగా పేరొందిన శకుంతలాదేవి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతలాదేవి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం జీవీకే ఆచారి మాట్లాడుతూ శకుంతలాదేవి తన మూడో ఏట నుంచి తుది శ్వాస వరకు గణిత శాస్త్రానికి అందించిన సేవల్ని కొనియాడారు. కంప్యూటర్ కంటే వేగంగా లెక్కలు వేసి, హ్యూమన్ కంప్యూటర్‌గా ఆమె పేరొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఆటలు, పాటలు, నృత్యాల ద్వారా గణిత ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.సోమరాజు, సబిత లక్ష్మి, బోయిన చిన్నారావు, శేఖర్, త్రివేణి పాల్గొన్నారు.

కృష్ణుడి ఆలయానికి శంకుస్థాపన

కశింకోట: మండలంలోని పరవాడపాలెం శివారు ఉగ్గిన గంగునాయుడుపాలెంలో నూతనంగా నిర్మించనున్న కృష్ణ భగవానుడి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో సాగేవారికి ఎలాంటి మానసిక ఇబ్బందులు తలెత్తబోవన్నారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. వారిని నిర్వాహకులు, మహిళలు సత్కరించారు. స్థానికుల సహకారంతో త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.